క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు బాలికల ఎంపిక



నాగాయలంక: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు కొక్కిలిగడ్డ విన్నీ, నాగిడి అశ్విని ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వనమా రామకృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెనమలూరు బ్లూమింగ్ బెల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కృష్ణా జిల్లా సెలక్షన్స్ జరిగాయని, అండర్–17 విభాగంలో 50, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో వీరు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థినులను, పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావును స్కూల్ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ వీరకుమారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రక్త నమూనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని మన టీవీ భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ నిర్ధారణ వల్ల అవసరమైన వారికి వెంటనే రక్తదానం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వంగర శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, ఐక్యూ ఏపీ కో–ఆర్డినేటర్ పి. సంధ్య, టెక్నీషియన్ ఆనంద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



సామ్రాజ్యం (ఫైల్)

అవనిగడ్డ: వేకనూరుకు చెందిన తుంగల సామ్రాజ్యం (80) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సామ్రాజ్యం అనారోగ్యంతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న నాగాయలంకకు చెందిన సమరతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ నేత్రదానంపై సామ్రాజ్యం కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు వచ్చి సామ్రాజ్యం నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



కృత్తివెన్ను: రైతులు ఈ నెల 10వ తేదీలోగా ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఏఓ జెన్ని అన్నారు. ఇప్పటివరకు కృత్తివెన్ను మండలంలో 4,973 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు జరిగిందన్నారు. ఈకేవైసీ 75 శాతం పూర్తయిందని, మిగిలిన 25 శాతం రైతులు కూడా ఈనెల 10వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. శనివారం కృత్తివెన్నులో పలువురు రైతుల పంటకు ఈ క్రాఫ్ నమోదు చేశామని ఆమె వివరించారు.

నజరానాకు మాతృ వియోగం



నజ్మా బేగం (ఫైల్)

చల్లపల్లి: ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానాకు మాతృవియోగం కలిగింది. శనివారం రాత్రి స్థానిక ఇస్లాంనగర్‌లోని నజరానా మాతృమూర్తి నజ్మా బేగం మృతి చెందారు. ఆమె మృతికి జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్ సంతాపం తెలిపారు.

ఏపీఆర్వో రాజేష్‌కు ఉద్యోగోన్నతి



మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి. రాజేష్‌కు డివిజనల్ పీఆర్వోగా ఉద్యోగోన్నతి లభించింది. మచిలీపట్నం కలెక్టరేట్‌లోని పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు ఇక్కడే ఉద్యోగోన్నతి పోస్టింగ్ ఇచ్చారు. శనివారం ఆయన డివిజనల్ పీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

భారీ అన్నసమారాధన

గుడివాడటౌన్: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి మినీ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం భారీ అన్నసమారాధన జరిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గౌర్ల శ్రీను సమారాధనను ప్రారంభించారు. అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



కె. కొత్తపాలెం శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని



మల్లవోలు శిబిరంలో వృద్ధురాలికి కంటి పరీక్షల అద్దాలను పెడుతున్న మంత్రి జోగి రమేష్

- మంత్రి జోగి రమేష్
- మల్లవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం
- రోగులకు వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ

గూడూరు: ప్రతి పేదవాడి గడప వద్దకు వైద్యం అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం మల్లవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారని, అందుకు ఆయనకు మనం ఎంతో రుణపడి ఉంటామని చెప్పారు. అభివృద్ధి సంక్షేమం ఇంతటితో ఆగదని, ప్రజాభిమానంతో కనీసం 25 సంవత్సరాల పాటు మన రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు 11 రకాల పరీక్షలను నిర్వహిస్తారని, శిబిరంలో 162 రకాల నాణ్యమైన మందులు సిద్ధంగా ఉంచారని తెలిపారు. అవసరాన్ని బట్టి వారికి అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహించి తగు వైద్యం అందిస్తూ ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మధుసూదనరావు, సురేష్ రంగబాబు, కామేశ్వరరావు, వెంకటకృష్ణారావు, పెదబాబు, రవికుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివనారాయణ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, ఎంపీడీఓ డి. సుబ్బారావు, తహసీల్దార్ విజయప్రసాద్, సర్పంచ్ సాంబయ్య, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి



పర్రచివర గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నగరంలోని వల్లెగూడెం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పేర్ని నాని శనివారం ప్రారంభించారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కానింగ్ మిషన్‌ను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. పేర్ని నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ జి. గీతాబాయి, కమిషనర్ చంద్రయ్య, మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, బొర్రా విఠల్, బూరగడ్డ రమేష్‌నాయుడు, కార్పొరేటర్లు, వైద్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

మోపిదేవి: ప్రజల ఆరోగ్యంపై జగనన్న ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, దానిలో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ప్రజలకు వరమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కె. కొత్తపాలెం జెడ్పీ పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలకు వారి గ్రామానికి వచ్చి వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని చెప్పారు. జేఏఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కుంభా రత్నగిరి, ఆర్థోపెడిక్ డాక్టర్ కేవీ శివప్రసాద్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. అనూష, డాక్టర్ నితిన్, పీహెచ్‌సీ వైద్యులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పర్రచివరలో 450 మందికి వైద్య సేవలు

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష సేవల శిబిరం తహసీల్దార్ జె.విమలకుమారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, ఎదురుమొండి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ ఫాతిమున్నీసా, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాగోలులో 400 మందికి వైద్య సేవలు

పాగోలు(చల్లపల్లి): స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని తెలిపారు. గ్రామ సచివాలయ స్థాయిలో పేదల నివాసాల చెంతకే చక్కని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని వివరించారు. శిబిరంలో 400మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు పాల్గొన్నారు.

మాట్లాం గ్రామంలో..

కృత్తివెన్ను: మండల పరిధి మాట్లాం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య పరీక్షల తీరును పరిశీలించి రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, వైద్యులు సందీప్, అల్తాఫ్, హీరా తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అశ్వరావుపాలెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు రోగులను పరీక్షించి అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కోనేరుసెంటర్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ గీతాబాయి అన్నారు. మండల పరిధి చిన్నాపురం–2 నెలకుర్రు సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తొమ్మిది మందిని ఆరోగ్యశ్రీ కి రిఫర్ చేశారు. 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, ఆపరేషన్లకు రిఫర్ చేశారు. వైద్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నెలకుర్రు శిబిరంలో మందులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయ్

అంగన్‌వాడీల సేవలు భేష్

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. నగరంలోని వల్లెగూడెంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పేర్ని నాని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార పిరమిడ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చేస్తున్న బోధనా పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే పేర్ని నానికి వివరించారు. పౌష్టికాహార పదార్థాలతో తయారుచేసిన తినుబండారాలను ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్నింటిని రుచి చూసిన ఎమ్మెల్యే పేర్ని నాని రక్తహీనతో ఉన్న మహిళలకు ఈ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరి, సూపర్‌వైజర్ జి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ ఊర చెరువులో విష ప్రయోగం



పెడన: మండల పరిధి నందిగామ శివారు బొడ్డువానిపాలెంలోని పంచాయతీ ఊర చెరువులో విష ప్రయోగం జరిగింది. దీనిపై గ్రామస్తులు అధికారులకు, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్, వీఆర్వో పార్వతి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. చెరువులోని నీటిని శాంపిల్స్ కోసం సేకరించారు. చెరువులో కలిపిన మందు డబ్బాలను స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపిస్తామని ఎస్ఐ తెలిపారు. దీనిపై విచారణ చేస్తామన్నారు. ఘటనాస్థలాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి రామానాయుడు తదితరులు పరిశీలించి గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. పాడి పశువులు చెరువులోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశువుల యజమానులకు సూచించారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి అనురాధ మాట్లాడుతూ విష ప్రయోగం జరిగిన మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

పేదల పక్షపాతి జగనన్న

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

టీ.కొత్తపాలెం(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని, నిత్యం వారి సంక్షేమానికే కట్టుబడి పనిచేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. రేమాలవారిపాలెం సచివాలయం పరిధిలోని టి.కొత్తపాలెం, శివారు మరియపురం, నారాయణరావు నగర్ గ్రామాలలో ఎమ్మెల్యే రమేష్, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌తో కలిసి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 454 గృహాలకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ సచివాలయం ఏర్పాటు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతం నుంచి రెవెన్యూ గ్రామంగా ఉన్న టి.కొత్తపాలెంలో సచివాలయం లేకుండా రేమాలవారిపాలెంలో ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇప్పటికే జిల్లా అధికారులు, ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపానని, తప్పనిసరిగా సచివాలయ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



బ్రోచర్ అందజేసి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, వికాస్

సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), బండ్రెడ్డి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంవి సాంబశివరావు (నాగాయలంక), తోట సాయిబాబు (బర్రంకుల), బండ్రెడ్డి శ్రీనివాసరావు, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, జిల్లా యూత్ కార్యదర్శి ఆకుల బాబీకుమార్, నంద్యాల వెంకట కోటేశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో నగరాభివృద్ధి

మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మచిలీపట్నం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. 37వ డివిజన్ రాజుపేటలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి డివిజన్‌కు రూ. 20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తోందని, ఈ నిధులతో అయా డివిజన్లలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రెయిన్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తీసుకురావటం ద్వారా నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తొలుత వీఎం రంగా విగ్రహానికి మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్లు ఐనం తాతారావు, మిరియాల బసవపూర్ణ, రామిశెట్టి వాణిశ్రీ, యండ్రపాటి నాగేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, మాడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నూకల ప్రసాద్, మొహమ్మద్ రఫీ, బూరగ రామారావు, షేక్ మొహమ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

విద్యార్థులతో డీఈఓ సెల్ఫీ

మచిలీపట్నంటౌన్: ఇటీవల జరిగిన ఎఫ్ఏ–1 పరీక్షలో క్లాస్ ఫస్ట్ సాధించిన 9, 10 తరగతుల విద్యార్థులతో డీఈఓ తాహెరా సుల్తానా శనివారం సెల్ఫీ దిగారు. నగరంలోని జార్జి కార్పోరేషనల్ హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఆమె సెల్ఫీ దిగారు. విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సెల్ఫీ కార్యక్రమంలో భాగంగా డీఈఓ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విద్యార్థినితో సెల్ఫీ దిగిన డీఈఓ తాహెరా సుల్తానా

వెంకన్నకు సహస్ర దీపాలంకరణ సేవ

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని ఊరేగింపుగా తీసుకువచ్చి అన్నమయ్య కీర్తనలు, గోవింద నామాలతో ఊంజలసేవ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకస్వామి ముత్తేవి శశి కాంత్ బ్రహ్మత్వంలో ఈ సేవలు నిర్వహించారు.

రైల్వే ట్రాక్ ఆధునికీకరణ

గుడివాడటౌన్: కోట్లాది రూపాయలు వెచ్చించి నిడదవోలు – విజయవాడ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు పూర్తయిన అనంతరం ట్రాక్ ఆధునికీకరణ పనులు ప్రారంభించినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ మేనేజర్ ఎస్. వరుణ్‌బాబు తెలిపారు. విజయవాడ గుడివాడ మధ్య రైల్వే ట్రాక్ ఆధునికీకరణ పనులలో భాగంగా శనివారం అధునాతన యంత్రాలతో కాంక్రీట్ స్లీపర్ ఏర్పాటు పనులు నిర్వహించారు. దీనివలన ట్రాక్ బలం పెరుగుతుందని, తద్వారా రైలు వేగం పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే విజయవాడ – గుడివాడ, గుడివాడ – మచిలీపట్నం, గుడివాడ – భీమవరం ట్రాక్ డబ్లింగ్ పనులు పూర్తయి ఏడాది దాటిన సందర్భంగా ట్రాక్‌ను ధృడపర్చడం వలన రైలు మరింత వేగంగా వెళుతుందన్నారు.విజయవాడ – గుడివాడ మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు.

వైఎస్సార్ వారధి ప్రారంభం

కైకలూరు: వింజరం గ్రామంలో రూ.12 లక్షల నిధులతో నిర్మించిన వైఎస్సార్ వారధిని ఎమ్మెల్యే డీఎన్ఆర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

మౌలాలి సేవలు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలాలి ముస్లింలకు అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. ఐక్య వేదిక అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మౌలాలిని సంఘ నాయకులు శనివారం సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ యూనిఫాం కామన్ సివిల్ కోడ్ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించేలా ఐక్యతను తీసుకురావడంలో మౌలాలి కృషి చేశారన్నారు. మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలకు వ్యతిరేకంగా ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలు శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వేదిక మహిళా నగర విభాగం అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగం, జిల్లా ఆస్పత్రి మాజీ డైరెక్టర్ అబ్దుల్ అజీం, నాయకులు బాషు, ఖైరున్నీసా కుర్షిద్ బేగం, బీబీ ఫాతిమా, శంషాద్‌బేగం, మహబూబ్‌బాషా, న్యాయవాది మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలి- సబీనా దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వైఎస్సార్ బీమా అందజేత



శ్రీనివాస్ భార్యకు సాయం అందజేస్తున్న దృశ్యం



చిన వెంకటేశ్వరమ్మకు సాయం అందజేత

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంకు చెందిన మోపిదేవి చిన వెంకటేశ్వరరావు (46) గుండెపోటుతో శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో గోశాల వద్ద పనిచేస్తున్నారు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు మృతుని భార్య నాగమల్లేశ్వరికి నందిగం అభిషేకరావు చేతుల మీదుగా అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామరాజు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

దేవస్థానం తరపున రూ. 10 వేలు సాయం

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం తరపున రూ.10 వేలను మృతిని భార్య నాగమల్లేశ్వరికి ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ అందజేశారు. ఆలయ అధికారులు, పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన రావి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన తక్షణ సాయం రూ. 10 వేలను శ్రీనివాస్ భార్య సుధారాణికి కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంపై ఉపాధి కూలీల ఫిర్యాదు

చల్లపల్లి: చల్లపల్లి మండలం మాజేరు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాడని వైఎస్సార్సీపీ నాయకులు మేడూరి శ్రీనివాసరావు, కళ్లేపల్లి లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం మాజేరు నుంచి రెండు గ్రూపుల ఉపాధి హామీ కూలీలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓను కలిశారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలుకు పరిస్థితి వివరించారు. కొన్ని గ్రూపులకు వేతనాలు ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నాడని, సంవత్సరం నుంచి వేతనాలు అందని కార్మికులు కూడా ఉన్నారని తెలిపారు. మేడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరిలో చేసిన పనులకు ఇప్పటికీ వేతనాలు పడలేదన్నారు. దీనిపై ఎంపీడీఓ పరిశీలించగా, ఫీల్డ్ అసిస్టెంట్ మస్టర్లు కూడా సక్రమంగా సమర్పించలేదని గుర్తించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ మద్దాల వెంకటేశ్వరరావుపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఎంపీడీఓ చిన రాట్నాలుకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనారాయణ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com